క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



గుణదల(విజయవాడ తూర్పు): ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని సినీ తార మెహరీన్ పిలుపునిచ్చారు. స్థానిక వెటర్నరీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన జాయ్ ఎలక్ట్రిక్ షోరూంను ఆమె గురువారం ప్రారంభించారు. గరుడ సంస్థ ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మెహరీన్ చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగిందన్నారు. గరుడ సంస్థ ఫౌండర్ వెంకటరమణ మాట్లాడుతూ ఈ-వాహనాల వినియోగం ద్వారా ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతోందన్నారు.

రేపటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈనెల 21, 22, 23 తేదీల్లో క్రెడాయ్ విజయవాడ చాప్టర్ 9వ ప్రాపర్టీ షో ఎ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్, ప్రచార పోస్టర్లను గురువారం గుణదలలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం మనీష్ కుమార్ సింగ్ క్రెడాయ్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ రంగానికి చెందిన అన్ని విభాగాలను క్రెడాయ్ ప్రాపర్టీ షో ద్వారా ఒకే వేదికపైకి తీసుకురావడం శుభపరిణామమన్నారు. ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు క్రెడాయ్ కృషి అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణరావు, విజయవాడ చాప్టర్ అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, వరదా శ్రీధర్, ప్రాపర్టీషో కన్వీనర్లు జి. సత్యసాయిరామ్, కె.రఘురామ్ పాల్గొన్నారు.

జగన్మాతకు నృత్యాభిషేకం

విజయవాడ కల్చరల్: దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గానగర్‌లో ప్రదర్శిస్తున్న నృత్య కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గురువారం ఉభయతెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు జగన్మాతకు నృత్యాభిషేకం చేశారు. ఒంగోలు నుంచి వచ్చిన ఆధ్యాత్మికవేత్త పొన్నూరు వెంకటశ్రీనివాసులు దైవీవైభవంపై ప్రసంగించారు. చల్లపల్లి నుంచి వచ్చిన సామ్రాజ్యం దేవీ భక్తి గీతాలను, ఎం.అన్నపూర్ణ బృందం, ఎస్.దుర్గేష్ నందిని, పామర్రుకు చెందిన ఫణికుమార్ ఫ్లూట్‌పై త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. నాట్యాచార్యులు చదలవాడ ఆనంద్, త్రినాథాచారి బృందం సంప్రదాయ కీర్తనలను నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారి పోతరాజు రోషిత నవదుర్గ వైభం అంశాన్ని ప్రదర్శించి ఆకట్టుకుంది.

సురక్షిత తాగునీటితో ఆరోగ్యం

కంకిపాడు: సురక్షిత తాగునీటి సరఫరాతో ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో జల్ జీవన్‌మిషన్ నిధులు రూ.30లక్షల వ్యయ అంచనాతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ విస్తరణ పనులను గురువారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ తాగునీటి వసతులను మెరుగుపర్చాలని చెప్పారు.

సర్వశక్తిమయీ..

దసరా ఉత్సవాల్లో కుంకుమార్చనలు, హోమాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలు 'పశ్చిమ'లో కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం పలు ఆలయాల్లో అమ్మవారు మహా చండీదేవిగా, లలితాత్రిపురసుందరిదేవిగా, గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పాతశివాలయంలో..

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలోని భ్రమరాంబ.. అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు, చండీహోమం, ఖడ్గమాలార్చన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకం జరిగింది. కార్యక్రమాలను ఆలయ ఈఓ నాగరాజు పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో...

బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కొలువై ఉన్న పద్మావతీదేవి శ్రీ గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ ఈఓ ఘంటసాల శ్రీనివాసు పర్యవేక్షించారు.

చదును మహాలక్ష్మి దేవస్థానంలో..

కొత్తపేటలోని శ్రీ చదును మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉపాలయమైన అష్టలక్ష్ముల ఆలయంలో అమ్మవారిని శ్రీ వరలక్ష్మీదేవిగా అలంకరించారు. ఉభయదాతలు అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

గంగానమ్మ దేవస్థానంలో...

కేటీరోడ్డులోని గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉపాలయాల్లోని దేవతామూర్తులకు విశేష పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

చిట్టినగర్ పరిధిలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.



కొత్తపేటలో శ్రీ చండీదేవిగా చదును మహాలక్ష్మి



బ్రాహ్మణ వీధిలో గజలక్ష్మీదేవిగా పద్మావతీదేవి



పాతశివాలయంలో అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ



చిట్టినగర్ మహాలక్ష్మి ఆలయంలో..



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావుకు చిత్రపటం అందజేస్తూ..



కొత్తపేటలో మహాచండీదేవిగా దుర్గమ్మవారు

అమ్మవారిని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, మాజీ కార్పొరేటర్ డీవీ రమణబాబు దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలోని కల్యాణ మండపంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

విజయదుర్గ ఆలయంలో..

భీమనవారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పూజలు నిర్వహించారు. సాయంత్రం పంచహారతుల సేవ జరిగింది.

- పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని శ్రీలలితాంబికా పీఠంలో అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా, అమ్మవారికి పంచహారతుల సేవ జరిగింది. ఉత్సవాల ఏర్పాట్లను పీఠం కన్వీనర్ రాంపిళ్ల చైతన్య పర్యవేక్షించారు.

వీరాంజనేయస్వామి ఆలయంలో..

కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారు చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చండీదేవి హోమం చేశారు. మజ్జి రామచంద్రరావు, పూర్ణిమ దంపతులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది. ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థాన ఈవో రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

కరకట్ట వద్ద..

భవానీపురం కరకట్ట సమీపంలోని శ్రీ దుర్గా భవాని దేవస్థాన కమిటీ ఆధ్వర్యం ఆలయంలోని అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజ, సాయంత్రం పూజ, అనంతరం పంచహారతుల సేవ, శ్రీలలితా సహస్ర నామ పూర్వక విశేష కుంకుమ పూజ ప్రసాదాల వినియోగం జరిగింది. ఆలయ అర్చకులు దంటు భవానీశర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.



భీమనపేటలో లలితా త్రిపుర సుందరీదేవిగా విజయదురాదేవి



పాలఫ్యాక్టరీ వద్ద లలితా త్రిపుర సుందరీదేవిగా లలితాంబిక

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి సత్యనారాయణ దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో మహాచండీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసిన మంత్రి దంపతులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఈవో కె.ఎస్.రామారావు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దుర్గగుడి ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇతర పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మైనార్టీలకు అధిక ప్రాధాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మైనార్టీ వర్గాలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చి అండగా ఉంటున్నారని ఏపీ జైన్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి అన్నారు. ఇటీవల ఏపీ సిక్కు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ దిల్‌షాసింగ్ ఆనంద్ మనోజ్‌కొఠారిని మర్యాదపూర్వకంగా కలిశారు. దిల్‌షాసింగ్ ఆనంద్‌ను సత్కరించి గౌరవించారు. రాష్ట్రంలో మైనార్టీ వర్గాలు జైన్, సిక్కులను గత పాలకులెవరూ గుర్తించలేదని పేర్కొన్నారు. తమకు రాష్ట్రంలో సముచితమైన గౌరవాన్ని అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక సిక్కు, జైన్ వ్యాపార వర్గాల నాయకులు పాల్గొన్నారు.

మేరీమాత జపమాల

పెనమలూరు: కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో బుధవారం రాత్రి జపమాల.. స్తోత్రాలతో ప్రారంభమైంది. గుణదల మేరీమాత శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జపమాలను ప్రారంభించి గురువారం ఉదయం వరకు నిర్వహించామన్నారు. భక్తులకు దివ్యబలి పూజాప్రసాదం పంపిణీ చేశామని తెలిపారు. జపమాల కార్యక్రమానికి ఉపదేశకులు, యూనిట్ సభ్యులు, ప్యారిస్ కౌన్సిల్ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

పేదల మెరుగైన వైద్యానికి 'సురక్ష'

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదల మెరుగైన వైద్యానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. భవానీపురం 40వ డివిజన్‌లోని ఓ స్కూల్లో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ప్రవేశపెట్టి లక్షల మందికి ప్రాణదానం చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత మెరుగు పరచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. పేదలకు వైద్య సేవలు చేస్తూ అవసరమైన మందులు పంపిణీ చేయడం, హెల్త్ ప్రొఫైల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి నిపుణులతో చికిత్స చేయిస్తున్నారన్నారు. గతంలో ఎవరూ ఇటువంటి కార్యక్రమాలు చేయలేదని, భవిష్యత్‌లోనూ చేయబోరన్నారు. పేదల కోసం మహానేత వైఎస్సార్ బాటలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు అందించి సహకారంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా జరుగుతోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు, దత్త పుత్రుడు పవన్ కల్యాణ్ హేళన చేశారన్నారు. వాటి ద్వారానే పేదలకు అన్ని రకాల సేవలు అందిస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. పూర్తి ఆరోగ్యవంతులుగా మారేంత వరకు వైద్యసేవలు అందిస్తామన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆరోగ్య కిట్టును అందజేస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

యాత్రలో భువనేశ్వరి వాస్తవాలు చెప్పాలి

ప్రజాస్వామ్యంలో ఎవరైనా యాత్రలు చేయొచ్చని, భువనేశ్వరి యాత్రలు చేస్తే తప్పులేదన్నారు. కాకపోతే యాత్రలో తన భర్త అవినీతి పాల్పడ్డాడని, ప్రభుత్వం సొమ్ము దోచేశాడని భువనేశ్వరి ప్రజలకు వివరిస్తే బాగుంటుందన్నారు. ప్రజల ముందు మొసలి కన్నీరు కార్చకుండా వాస్తవాలు చెప్పాలని హితవు పలికారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల అంజనేయ రెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర రెడ్డి, కళ్లెం కృష్ణారెడ్డి, రోసిరెడ్డి, శివరామి రెడ్డి, గంపల నవీన్, నడికట్టు రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేరీమట్టి మేరీదేశ్ కలశయాత్ర

విజయవాడరూరల్: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ బ్లాక్ పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో మేరీ మట్టి మేరీదేశ్ కలశయాత్ర నిర్వహించారు. డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ సుంకర రాము మాట్లాడుతూ ఇండియా వన్ నేషన్ ఇంపార్టెన్స్‌ను కలశయాత్రపై వివరించారు. కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ లక్ష్మణస్వామి, డాక్టర్ ఎ.పతంజలి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి, విజయవాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయ ప్రతినిధి విజయబాబు, ఎస్ఆర్‌కే కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.చిన్న, ఆల్ ఇండియా రేడియో ప్రోగ్రామ్ స్టాఫ్ డాక్టర్ సీహెచ్ మాణిక్యరావు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ కాలేజీలో కలశయాత్ర

వైద్యులు, సిబ్బంది అప్రమత్తం ఉండండి

డీఎంహెచ్ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూల నక్షత్రం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో వైద్య శిబిరాల్లోని వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దసరా ఉత్సవాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను గురువారం ఆమె పరిశీలించారు. భక్తులకు అందిస్తున్న వైద్య సేవలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అంకిత భావంతో పని చేయాలన్నారు. 24 గంటలూ వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. అత్యవసర వైద్య అవసరాలు ఏర్పడినా జాగ్రత్తగా వ్యవహరించి సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.



సీతమ్మవారి పాదాల వద్ద వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ సుహాసిని

బాబాకు గులాబీలతో నామార్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో 105వ పుణ్యతిథి మహోత్సవాలు గురువారం ఐదోరోజుకు చేరుకున్నాయి. బాబావారికి విశేషంగా లఘున్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచసూక్త పఠనం చేశారు. క్షీరం, పంచదారతో బాబాకు అభిషేకం చేసి గులాబీలతో లక్షనామార్చన నిర్వహించారు.

లోక కల్యాణార్థం మందిర కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు సాయినాథ, దత్తాత్రేయ హోమం వేద పండితుల మంత్రోచ్చరణలతో మధ్య నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.



దత్తసాయి మందిరంలో..

పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. మందిరం వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు పూజలు చేసి పారాయణం చేశారు.









జగజ్జననికి జేజేలు

నమో చండీ అంటూ భక్తులు కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. దసరా ఉత్సవాల్లో గురువారం మహాచండీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మ సన్నిధిలో ప్రత్యేక కుంకుమార్చనలు, చండీ హోమం జరిగాయి. ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో పలుచోట్ల ఏర్పాటుచేసిన వైద్యశిబిరాలు అనేక మంది భక్తులకు సేవలు అందిస్తున్నాయి. ఉత్సవాల్లో దుర్గమ్మ అన్నప్రసాదానికి భక్తులు బారులు తీరి కనిపించారు. అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తజనం ఉప్పొంగిన భక్తిభావంతో వెనుతిరిగారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ









భక్తులకు అన్నప్రసాద వితరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భక్తులకు గురువారం ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్-2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అన్న ప్రసాద వితరణ జరిగింది. సుమారు వెయ్యి మంది భక్తులకు భోజనాలు వడ్డించారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): షాపునకు వెళ్లిన యువతి కనిపించకపోవడంతో తల్లి కొత్తపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వించిపేట రైల్వే క్వార్టర్స్‌లో నివసించే కొణతం సునీత, గురవయ్య భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె ఇంటర్ వరకు చదివి సత్యనారాయణపురంలోని ఓ షాపులో పని చేస్తోంది. ఈ నెల 18వ తేదీ షాపునకు వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.